పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

డెంగ్యూతో బాలుడు మృతి

వైద్యం వికటించి బాలుడు మృతి చెందాడని పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన

మృతుడు మనీశ్వర్

చేవెళ్లటౌన్, జూలై 9 : చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో డెంగ్యూతో చికిత్స పొందుతున్న బాలుడు మృతిచెందిన సంఘటన జరిగింది. వైద్యం వికటించే బాలుడు మృతిచెందాడని అరోపిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం ఆ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని చన్‌వెళ్లి గ్రామానికి చెందిన కుర్వ శ్రీనివాస్, సంతోష దంపతులకు ఇద్దరు కుమారులు. కాగా పెద్ద కొడుకు మనీశ్వర్ (11), చిన్న కొడుకు వర్షిత్ నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురవడంతో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రికి తీసుకువచ్చారు. వారిని పరీక్షించిన వైద్యులు ఇద్దరికీ డెంగ్యూ సోకిందని నిర్ధారించి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. చికిత్స పొందిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో మంగళవారం ఇంటికి పంపిస్తామని చెప్పారు. సోమవారం రాత్రి మనీశ్వర్ మరోసారి అస్వస్థతకు గురికాగా వైద్యులు ఇంజక్షన్ వేశారు. మంగళవారం ఉదయం కూడా మరో ఇంజక్షన్ చేసిన కొంతసేపటికే అతడి అరోగ్య పరిస్థితి క్షీణించడంతో మరణించాడు. ఉదయం వరకు తమతో మాట్లాడిన బాలుడు అంతలోనే అసువులు బాయడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఇంజక్షన్ వికటించడంతోనే బాలుడు మృతిచెందాడని.. బాధ్యులపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పట్టుబట్టారు. సుమారు నాలుగు గంటల పాటు అక్కడే బైఠాయించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్ అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్నవారిని సముదాయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడతామని వారు వెల్లడించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇద్దరికి డెంగ్యూ

బొంరాస్‌పేట : దుద్యాల మండలంలోని చెట్టుపల్లితండాలో ఇద్దరు చిన్నారులకు డెంగ్యూ సోకింది. రాజు, లలిత దంపతుల కొడుకులు రక్షిత్, అక్షిత్ జ్వరంతో బాధపడుతుండడంతో శనివారం టీహబ్‌లో రక్త పరీక్షలు చేయించారు. సోమవారం వీరిద్దరికీ డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్, మైలేరియా కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఫకీరప్ప, హెల్త్ సూపర్‌వైజర్ మణిమాల, ఏఎన్‌ఎం షాహిదా, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఆశ కార్యకర్తలు మంగళవారం తండాకు చేరుకుని డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, నీళ్ల విరేచనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగు కాల్వలు, నీటి నిల్వ గుంతల్లో టిమోఫాస్ మందును, దోమల నివారణకు ఇండ్ల లోపలి భాగాల్లో పైరిత్రం మందును పిచికారీ చేయించారు. జ్వర, లార్వే సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధపడేవారి రక్త నమూనాలను సేకరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

డెంగ్యూ, ఇతర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వనమహోత్సవానికి ప్రాధాన్యమివ్వాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో పలు అంశాలపై సీఎస్ సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, ఉన్నతాధికారులు

రంగారెడ్డి, జూలై 9 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. వనమహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతోపాటు, ధరణి దరఖాస్తులు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉద్యోగుల సాధారణ బదిలీలు తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వర్షాలు ఒకింత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నందున పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ఇది ఎంతో అనుకూలమైన సమయమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అనువైన స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, జిల్లాలవారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయించాలని, ఆగస్టు నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నూటికి నూరు శాతం మొక్కలు నాటేలా పకడ్బందీ కార్యాచరణ అమలు చేయాలన్నారు. ముఖ్యంగా అటవీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు వనమహోత్సవం విజయవంతంలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకుని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా వివిధ వర్గాల వారిలో స్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్లకు సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, సంపద వనాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఎక్కడైనా లోపాలుంటే సరిదిద్దాలని సూచించారు.

మహిళా శక్తి విజయవంతానికి కృషి చేయాలి

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని సీఎస్ సూచించారు. ఇప్పటికే మహిళలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల నేతృత్వంలో మౌలిక సదుపాయాల మెరుగుదల పనులు చేపట్టడంతోపాటు, విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతలను కూడా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించడం జరిగిందన్నారు. మహిళలు ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని, మరో నెల రోజుల్లోపు రెండవ జత స్కూల్ యూనిఫామ్‌లను కుట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు డెయిరీ, పౌల్ట్రీ ఫామ్, క్యాంటీన్ వంటి యూనిట్లు స్థాపించేందుకు, చిన్న తరహా పరిశ్రమలు, స్థానిక పరిస్థితులకు అనువుగా ఉండే వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వపరంగా తోడ్పాటును అందించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. వంటగది, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, వర్షపు నీరు, మురుగు జలాలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, అతిసారా, విషజ్వరాలు వంటి వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువులకు కొరత లేకుండా చూడాలి

ఎరువులకు ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతు నేస్తం ప్రోగ్రామ్‌ల ద్వారా రైతులకు కావలసిన సలహాలు, నూతన సాగు విధానాలపై ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనుల్లో పూర్తి కాని పనులను వెంటనే చేయాలని ఆదేశించారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా జరిపిన విధంగానే, ఉద్యోగుల సాధారణ బదిలీలను కూడా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిబంధనలను పాటిస్తూ ఈ నెల 20లోగా బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపడుతున్నామన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి, నాటిన ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేపట్టి సంరక్షిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, పీడీ డీఆర్డీఏ శ్రీలత, డీపీవో సురేశ్ మోహన్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్ని చోట్లా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలి

వికారాబాద్ : జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్ని చోట్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో వనమహోత్సవం కింద మొక్కలు నాటేందుకు స్థలాలను ఎంపిక చేయాలచి సూచించారు. బదిలీల ప్రక్రియలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్, డీఆర్‌డీఏ శ్రీనివాసులు, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పల్వన్ కుమార్, డీఈవో రేణుకాదేవి, వ్యవసాయ అధికారి గోపాల్, డీపీవో జయసుధ, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఉన్నతాధికారులు

కడ్తాల్‌లో నిర్మించిన కేజీబీవీ నూతన భవనం

గ్రహణం వీడేదెప్పుడు..?

- ప్రారంభానికి నోచుకోని కేజీబీవీ నూతన భవనం
- రూ.3.35 కోట్ల వ్యయంతో భవన నిర్మాణ పనులు పూర్తి
- భవనం ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కడ్తాల్, జూలై 9 : మండల కేంద్రంలో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం కొత్త భవనానికి రాజకీయ గ్రహణం పట్టింది. నూతన భవన నిర్మాణ పనులు పూర్తయి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడంలేదు. 2017-18 విద్యా సంవత్సరంలో కేజీబీవీ విద్యాలయం అద్దె భవనంలో ప్రారంభమైంది. ఆ భవనంలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతూ వచ్చారు.

రూ.3.35 కోట్లతో పనులు

విద్యార్థినులు పడుతున్న కష్టాలను తీర్చడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీబీవీకి సొంత భవన నిర్మాణానికి రూ.3.35 కోట్లు మంజూరు చేసి.. కడ్తాల్-కాన్గుబావి తండా రోడ్డులో రెండు ఎకరాల భూమిని కేటాయించింది. విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ నిధులతో మార్చి 12, 2020లో అప్పటి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కేజీబీవీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై స్థానిక నేతలు, ఉపాధ్యాయులు సంబంధిత అధికారులకు విన్నవించడంతో పాటు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసువచ్చారు. దీంతో గత ఆరు నెలలుగా భవన నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. జూన్ మొదటి వారంలో భవనంలో చిన్నచిన్న పనులు మినహా అన్ని పనులు పూర్తయ్యాయి. ఎలాగూ ఈ విద్యా సంవత్సరంలో నూతన భవనం ప్రారంభమై తరగతులు మొదలవుతాయని, వేసవి సెలవుల్లోనే అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీని ఖాళీ చేశారు. విద్యా సంవత్సరం మొదలై దాదాపు నెల రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం కొత్త భవవాన్ని ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత విద్యార్థులతోపాటు కొత్తగా వచ్చిన అడ్మిషన్లతో విద్యార్థినుల సంఖ్య 260కి చేరింది. పాఠశాల ప్రారంభం కాకపోవడంతో 7, 8, 9వ తరగతి విద్యార్థినులను కందుకూరు కేజీబీవీలో.. 6, 10వ తరగతి విద్యార్థినులను ఆమనగల్లు కేజీబీవీలో చేర్పించినట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. భవనాన్ని ప్రారంభించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అలసత్వం ప్రదర్శించడం పట్ల స్థానిక నేతలు, విద్యార్థినుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కేజీబీవీ భవనాన్ని ప్రారంభించి విద్యార్థినుల సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

త్వరలో కేజీబీవీని ప్రారంభిస్తాం

అన్ని హంగులతో కేజీబీవీ భవనాన్ని నిర్మించారు. భవనంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని రకాల వసతులు ఉన్నాయి. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల సందర్భంగా కాస్త జాప్యం జరిగింది. త్వరలో కేజీబీవీని ప్రారంభించి తరగతులను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- సర్దార్‌నాయక్, మండల విద్యాధికారి, కడ్తాల్

కేజీబీవీని వెంటనే ప్రారంభించాలి

కేజీబీవీకి సొంత భవనం లేకపోవడంతో గత ప్రభుత్వం భవన నిర్మాణానికి నిధులను కేటాయించింది. గుత్తేదారుడి నిర్లక్ష్యంతో భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగాయి. అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో గత నెలలో భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా భవనాన్ని ప్రారంభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా కేజీబీవీని ప్రారంభించి విద్యార్థినుల సమస్యలను తీర్చాలి. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

- దశరథ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ, కడ్తాల్ మండలం

ఒత్తిడికి గురికావొద్దు

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

ఏఆర్ హెడ్ క్వార్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూలై 9 : పోలీస్ సిబ్బంది ఎలాంటి ఒత్తిడి లేకుండా విధులు సక్రమంగా నిర్వర్తించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ పోలీస్ అధికారులతో పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని.. వృత్తిపరమైన ఇబ్బందులు, మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి గురి కావొద్దన్నారు. డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు వచ్చేలా క్రమశిక్షణతో పని చేస్తూ.. తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సిబ్బంది సులువుగా ఫిర్యాదు చేసుకునేందుకు గ్రీవియన్స్ బాక్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న స్టోర్‌రూమ్, ఏఆర్ డీఎస్పీ, ఆర్ఐ కార్యాలయాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, ఆర్ఐలు అంజద్‌పాషా, డెవిడ్ విజయ్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది ఉన్నారు.

నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, ఉన్నతాధికారులు

రంగారెడ్డి, జూలై 9 (నమస్తే తెలంగాణ) : నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలని కలెక్టర్ శశాంక ఆకాంక్షించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శించే నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. విద్యాశాఖతోపాటు పలు శాఖల అధికారులు పాఠశాలలు, గ్రామాల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదును పెట్టేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు సంబంధించి రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసిన స్క్రిప్టుతో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నం.9100678543కు పేరు, వయసు, ఫొటో, వృత్తి, గ్రామం, జిల్లా పేరు తదితర వివరాలతో ఆగస్టు 3 లోగా పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, పీడీ డీఆర్డీఏ శ్రీలత, డీపీవో సురేశ్‌మోహన్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ ఇన్నోవేషన్ కో-ఆర్డినేటర్ వాసు, అధికారులు పాల్గొన్నారు.

ధారూరులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

ధారూరు, జూలై 9 : చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధారూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్రలతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ధరణిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మండల పరిధిలోని రాంపూర్‌తండా రైతులతో మాట్లాడి.. వారి సమస్యలను అధికారులు పరిష్కారిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ధారూరు తహసీల్దార్ సాజిదాబేగం, రెవెన్యూ అధికారులున్నారు.

న్యాయం చేయాలి

రిటైర్మెంట్ బెన్ఫిట్స్ పెంచాలని అంగన్‌వాడీ, ఆయాల రిలే నిరాహార దీక్ష

రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

వికారాబాద్, జూలై 9 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కల్పించాలని గత ప్రభుత్వంలో ధర్నాలు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేలు అందించేందుకు ఒప్పుకుందన్నారు. కాని అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్షతో పాటు రిటైర్మెంట్ అనంతరం జీతంలో సగం పింఛన్ రూపంలో అందజేయాలని డిమాండ్ చేశారు. గత 4 నాలుగు రోజులుగా ఈ రిలేని రాహార దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు గుర్తు చేశారు. ఈ దీక్షలో దాదాపు 70 మంది వరకు పాల్గొని డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అంబాబాయి, లలితాబాయి, వీరమణి, బసమ్మ, నరసమ్మ, రంగమ్మ, ఇస్మాల్‌బీ, భీమమ్మ, బాగమ్మ పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లన్నింటినీ వినియోగంలోకి తేవాలి

- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి
- అధికారులకు కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

గచ్చిబౌలి చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ) : నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పబ్లిక్ టాయ్‌లెట్లన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. మంగళవారం బుద్ధభవన్‌లో రెవెన్యూ, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ఫైనాన్స్ విభాగాల అధికారులతో కమిషనర్ ఆయా విభాగాల అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. జీహెచ్ఎంసీలో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదాయం పెంపునకు చేపట్టిన జీఏఎస్ సర్వేను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. నాలాల వరద నీరు నిలువకుండా ఫ్లోటింగ్ మెటీరియల్‌ను వెనువెంటనే తొలగించే విషయాలపై చర్చించారు. స్వచ్ఛ ఆటోలు నిర్దేశించిన ప్రకారంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ్ చౌహాన్, రవికిరణ్, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీశ్, ట్యాక్స్ వాల్యుయేషన్ అధికారి మహేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయండి

మియాపూర్ : ఎస్ఆర్‌డీపీ కింద గచ్చిబౌలి కూడలిలో చేపడుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఆస్తుల సేకరణ సహా ఇతర ఏ ఇబ్బందులున్నా పరిష్కారానికి శీఘ్రంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు సీఈ దేవానంద్ సహా ఇతర అధికారులతో కలిసి ఆమె గచ్చిబౌలి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గుల్మొహర్ పార్కు, త్రిపుల్ ఐటీ కూడళ్లతో పాటు లింగంపల్లి ఆర్‌యూబీ, హెచ్ఎసీయూ బస్ డిపో ఎదుట మసీదు బండ ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యల్లేకుండా ఫ్రీ లెఫ్ట్‌లను మరింతగా ఏర్పాటు చేయాలని, కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. లింగంపల్లి ఆర్‌యూబీ వద్ద శాశ్వత పరిష్కారానికిగాను ఆర్‌వోబీ నిర్మాణానికి తగు ప్రతిపాదనలను రూపొందించాలని తెలిపారు. మసీదు బండ నుంచి గచ్చిబౌలి వరకు రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కీలకమైన కూడళ్లలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో డీసీ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.